# జాగృతి

'ఘర్శాన వెంకట సుబ్బారావు



**పదమూడో నంబరు బస్సు కె.జి.హెచ్ బస్సుస్టాప్ దగ్గర ఆగింది. పక్కన కూర్చున్న అతన్ని సీటు చూడమనిచెప్పి జేబులోనుండి పదిరూపాయల నోటు తీసి బస్‌స్టాప్ దగ్గర్లో డోలక్ వాయిస్తూ పాటలు పాడుతూ అడుక్కుంటున్న అతని చేతిలో పెట్టాడు భాస్కర్.**

చేతికి తగిలిన కాగితాన్ని కనీకనబడని తన కళ్లతో చూస్తూ తన్మయత్వంతో తబ్బిబ్బయి పోతున్నాడా ముష్టివాడు. ఎందుకంటే వాడి బతుక్కి పది రూపాయలు దొరకడం గొప్పే!

పనిముగించుకుని యథాప్రకారం సీట్లో కూల బడ్డాడు భాస్కర్. అతని పక్కన కూర్చున్నతను అదేపనిగా భాస్కర్‌నే చూస్తున్నాడు. అతని వయస్సు నలభైపైనే ఉండవచ్చు. అతని ముఖంలో సందేహాల మేఘాలు దోబూచులాడుతున్నాయి. అప్రయత్నంగా అన్నాడతను.

"మీరతనికి అంతడబ్బు ఎందుకిచ్చినట్టు?"

అతని ప్రశ్నకు ఎందుకు సమాధానం చెప్పాలి అని లోలోపల అనిపించినప్పటికీ సంభాషణ ఎందుకు పొడిగించడం అని, 'ధర్మం' క్లుప్తంగా

ముగించాడు భాస్కర్.

"అంటే?" నివృత్తి కాని సందేహంతో మళ్లా ప్రశ్నించాడు.

"అతను మీకు బాగా తెలుసా?" సమాధానం చెప్పేలోపే మరో ప్రశ్న.

"ఇవ్వాలనిపించింది, ఇచ్చాను!" ముక్తసరిగా చెప్పాడు భాస్కర్.

"కరెక్టే! ఎంతైనా ఇవ్వొచ్చు. ఒకేసారి అంత పెద్దమొత్తం ఇవ్వడానికి ఏదైనా ఒక కారణం ఉండి ఉండాలి."

అతనికేం సమాధానం చెప్పాలో అర్థం కాక దిక్కులు చూస్తున్నాడు. భాస్కర్ దిగాల్సిన బస్‌స్టాప్ వచ్చింది.

'బతుకుజీవుడా!' అనుకుంటూ గబగబా దిగేశాడు.

వెనక నుండి ఎవరో పిలుస్తున్నట్టనిపించింది. పిలుపు మరోసారి విన్నాడు. "ఏయ్, మిస్టర్! మిమ్మల్నే!" సందేహం లేదు అతనే.

'నన్నెందుకిలా వెంబడిస్తున్నట్టు. పారిపోడానికి నేనేం దొంగను కానుగా!' అని లోలోపల అనుకుంటూ వెనక్కి తిరిగి చూసి ఆగాడు.

అతను భాస్కర్ దగ్గరికి వచ్చి, "ప్లీజ్! మీతో అయిదునిమిషాలు మాట్లాడాలి. రండి, అలా కూర్చుందాం!" అన్నాడు.

ఇద్దరూ దగ్గరలో ఉన్న డైమండ్ పార్క్‌లోని వెళ్లి కూర్చున్నారు.

"మీరు అతనికి అంత డబ్బు ఎందుకిచ్చారో చెప్పారు కాదు!" మళ్లా అదే ప్రశ్న.

"సమాధానం మీకంత అవసరమా?"

"తెలుసుకుంటే విని సంతోషించాలని."

"సరే, అతను నాకు ఊపిరి."

"కొంచెం అర్థమయ్యేటట్టు చెప్పండి!"

"ఈమధ్య ఒక ప్రముఖ వారపత్రికకు అతని జీవితకథను తని ద్వారా తెలుసుకుని కథ రాసి పంపాను. ఆ ప్రముఖ వారపత్రిక వాళ్లు నా కథకు తృతీయ బహుమతి ఇచ్చారు. అతని కారణంగానే నా కథకు బహుమతి రావడం, ముమ్ముందు కథలు రాయాలనే ఉత్సాహం నాలో కలుగుతూండడం, అతని జీవిత విశేషాల్ని నా కథకోసం ఉపయోగించుకున్నందుకు ఒక పదిరూపాయలు ధర్మం చేశాను. తప్పంటారా?"

"బాగుంది. అయితే మీ కెంత బహుమతి వచ్చింది?"

"పదిహేనువందలు."

"మీ ఫొటో పేపర్లో పడింది, కదూ!"

"అవును."

"మీ స్వార్థం కోసం అతన్ని వాడుకున్నారన్న మాట!" అతని కంఠంలో తీవ్రత ధ్వనించింది.

"స్వార్థం ఏముంది? అతని జీవితం గురించిన వివరాలు పాఠకులకు తెలియడం వలన అతని మీద సానుభూతి లభిస్తుంది కానీ, అతనికేమీ నష్టం లేదుగా!"

"మీరన్నది కరెక్టే! ఆ పాత్రను సక్రమంగా వాడుకున్నంతవరకు."

'నేనూ అంతేచేశాను. దాంట్లో తప్పేముంది?'

"తప్పేమీ లేదా? మరోసారి ఆలోచించండి!"

"ఏమీ లేదు."

"ఉంది, చాలా ఉంది!" అతని కంఠం బిగుసుకుంది.

"మరో హంతకుడు ... బతికి ఉన్న పాత్రలను సమాధి చేసే మేన్‌కిల్లర్! మీ కథ పాఠకుల సానుభూతిని నోచుకోవాలన్న తాపత్రయంతో ఆ పాత్రను కీలుబొమ్మలా వాడుకున్నారు.

భాస్కర్ గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

"మీరు ... నా కథ చదివారా?"

"చదివాను కాబట్టే మీ నైజం అర్థం చేసుకున్నాను. పత్రికలో ఫొటో చూశాను కాబట్టే మిమ్మల్ని గుర్తుపట్టగలిగాను. మీలాంటివాళ్లను చాలామందిని స్టడీ చేశాను. కవిత్వం సమాజాన్ని ఉద్ధరించాలి. వాస్తవికంగా ఉండాలి. సమాజానికి దర్పణంలా ఉండాలి అంటూ కాలుష్యంలోకి అడుగు పెడుతూ ఉంటారు. మీరు కథాగమనంలో చేసే జిమ్మిక్కులన్నీ పాఠకులను కంట తడిపెట్టించడం కోసం ... అందుకే మీరు ఆ పాత్రను చంపారు. ఇప్పుడుచెప్పండి, మీరు హంతకులుకాదా?"

నిజమే! అతను చెప్పింది ముమ్మాటికీ నిజం. కథకు పాఠకుల సానుభూతి లభించాలనే ఉద్దేశ్యంతో బతికి ఉన్న పాత్రను కథ కోసం చంపడం జరిగింది. కానీ ఈ విషయం ఈయనకి ఎలా తెలిసింది చెప్మా!

లోలోపల గొణుక్కున్నాడు భాస్కర్.

అతడి గొంతు మూగవోయింది. స్తబ్దుడయ్యాడు. క్షణకాలం తర్వాత తేరుకుని, "క్షమించండి, పొరపాటైంది! మీరు నా కథకు మంచి విమర్శనిచ్చారు!" అన్నాడు.

"క్షమించండి అనడం కాదు. పొరపాటు సరిదిద్దుకోవాలి. చూడండి, భాస్కర్! మీరా కథను ఆద్యంతం అద్భుతంగా రాశారు. కథలో ప్రతి సన్నివేశమూ హృదయాన్ని ఆకట్టుకునేలా ఉంది. ఎంతో చక్కగా కథ మలిచిన మీరు చివరలో కృత్రిమంగా ముగించారు. మీ కథ చదివి కొన్ని వేలమంది పాఠకులు స్పందిస్తారన్నది నిజం. కానీ ఈ ముష్టివాడి గురించి తెలిసిన ఒక్క పాఠకుడు ఉంటే అతని మనోభావాలు ఎలా ఉంటాయి? రచయితల మీద అతని దృక్పథం ఎలా ఉంటుంది? అతను సాటి రచయితలను ఎలా గౌరవించగలడు? అభూతకల్పనలు సృష్టించే రచయితగా పాత్రలను అవసరానికి వాడుకొని, వాటిని హతమార్చే స్వార్థపరుడిగా కనిపించరా!"

"సారీ సార్! ఇంకెప్పుడూ అలా రాయను. పాఠకులకు అంత సృజనాత్మకశక్తి ఉంటుందని ఊహించలేదు. పాఠకులకు కథ చదివి, విషయాన్ని జీర్ణించుకునే సామర్థ్యం ఉంటుందని తక్కువగా అంచనా వేశాను. మీ సద్విమర్శ నాలోని అసలు రచయితను మేల్కొలిపింది. ఇంతకీ మీరెవరో తెలుసుకోవచ్చునా?" అడిగాడు భాస్కర్.

"నా పేరు జయరాం! కె.జి.హెచ్.లో అసిస్టెంట్ సర్జన్‌గా చేస్తున్నాను. నేను ప్రతిరోజూ బస్సెక్కి వెళ్లేది మీ కథాస్థలం నుండే ..."

"అంటే .... ప్రముఖ రచయిత జయరాం."

అతను నవ్వుతూ అలా కదిలి వెళ్లిపోతుంటే అవాక్కయి నిల్చుండిపోయాడు యువ రచయిత భాస్కర్.

